
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల జిల్లా వార్తలు 5
ఆదివారం 7 జూలై 2024



● బ్రిటీష్ పాలనలో జమిందారులు, పెత్తందారులు తమ ఇంటిగుమ్మాలకు అడవిదున్నల కొమ్ములతో కూడిన తలలను (ఇండియన్ గౌర్ ట్రోఫీలు) వేలాడ తీసుకుని తమ ఆడంబరాన్ని ప్రదర్శించేవారు. ఇందుకోసం అడవిదున్నలను వేటాడి చంపేవారు. అలా కూడా అంతరించిపోయి ఉండవచ్చని అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు.

● ఆకురాల్చు అడవులైన నల్లమలలో నేటికి వేసవిలో వన్యప్రాణులకు నీటికష్టాలు తప్పడం లేదు. పలు సందర్భాల్లో నల్లమల మీదుగా వెళ్లే కృష్ణానదిని మినహాయిస్తే ఎక్కడో లోయల్లో తప్ప చుక్కనీరు కనిపించదు. చురుకైన శరీర సౌష్టవం కలిగిన జంతువులు లోయల్లోకి ఎక్కి దిగడంతో సులభతరమైనప్పటికీ భారీ కాయాన్ని కలిగిన అడవిదున్నలకు నీటి కష్టాలు కూడా తోడు కావడంతో అంతరించిపోవడానికి కారణంగా ఉన్నాయి.

ఆదివారం ప్రత్యేకం
Sundayspecial

● అదృశ్యమైన జంతువు తిరిగి అదే అడవిలోకి..
● ప్రయోగాత్మకంగా వదిలేందుకు కసరత్తు
● ఇప్పటికే శాస్త్రవేత్తల బృందం పరిశోధన
● అడవిదున్నల ఆవాసానికి నల్లమల అనుకూలమని నివేదిక

నల్లమలలో అడవి దున్నలు..!



ఆత్మకూరు, జూలై 5:

ఆరున్నర అడుగుల ఎత్తు.. 12 అడుగుల పొడవు.. 800 నుంచి 1500 కేజీల భారీ ఆకారం.. పెద్దపులులను సైతం మట్టికరిపించే టెంపరితనం.. అన్ని కలగలిసిన అరుదైన శాఖాహార వన్యప్రాణి అడవి దున్న. పాడిగేదెను పోలి ఉండే ఈ జంతువు వందేళ్ల క్రితమే నల్లమల అడవిలో ఉండేదని తెలిసింది. అయితే నల్లమలలో అడవి దున్నలు ఎప్పుడు అంతరించిపోయాయో కూడా తెలియడం లేదు. ఇందుకు సంబంధించిన శాస్త్రీమైన అంశాలేవి అటవీ శాఖ వద్ద లేవు. వీటిని ఆంగ్లంలో ఇండియన్ గౌర్ పిలుస్తుండగా, శాస్త్రీయ నామం బాస్ గారస్ అంటారు. కాగా జీవవైవిధ్యంలో భాగంగా ఒకప్పుడు నల్లమలలో అదృశ్యమైన అడవి దున్నలు తిరిగి అదే అడవిలోకి రప్పించేందుకు అటవీశాఖ ప్రయోగాత్మకంగా కసరత్తు చేస్తోంది. ఇదే జరిగితే నల్లమల అడవులు మరో ప్రత్యేకతను చాటుకోనున్నాయి.

నల్లమలకు అడవి దున్నలను తెప్పించేందుకు కసరత్తు

తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అతిపెద్ద జీవవైవిధ్యం కలిగిన సుందరమైన అడవులు. అశేషమైన జంతుజాలాలు, వృక్షసంపదలు, ఔషధ మొక్కలు నల్లమలలో వదిగి ఉన్నాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన నల్లమలలో అడవి దున్నలను రప్పిస్తే ఓ వైపు అడవుల రక్షణతోపాటు జీవవైవిధ్యాన్ని కాపాడవచ్చునని అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే నల్లమలలోకి అడవి దున్నలను రప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే డెహ్రాడూన్‌లోని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తల బృందం ఇటీవల ప్రకాశం, నంద్యాల జిల్లాల పరిధిలోని నల్లమల అడవుల్లో నెల రోజులపాటు పర్యటించి అడవిదున్నల ఆవాసానికి అనుకూలమైన అంశాలను సేకరించి నివేదికలు రూపొందించినట్లు తెలిసింది. తొలివిడతగా ప్రయోగాత్మకంగా పది మగ, పది ఆడ అడవి దున్నలను ఇతర అడవుల నుంచి తెప్పించాలని భావిస్తున్నారు. వీటికి రేడియోకాలర్‌ను ఏర్పాటు చేసి జీపీఎస్ ద్వారా వీటి సంచారంపై నిఘా ఉంచనున్నారు. అనుకున్నట్లుగా అన్ని జరిగితే మరో రెండు, మూడు నెలల్లో నల్లమలలోకి అడవిదున్నలు రానున్నాయి.



నల్లమల అటవీ ప్రాంతంలో గత వారం కనిపించిన అడవిదున్న

పెద్దపులిని ఎదురించే ధైర్యం వాటి సొంతం

అడవిలో లభించే ఆకులు, పచ్చగడ్డి తదిర మొక్కలను ఆహారంగా తీసుకునే అడవిదున్నలు సున్నితమైన జీవనశైలిని కలిగి ఉంటాయి. అడవిలో తనకు హాని కలిగించే జంతువు కనిపిస్తే మాత్రం తన టెంపరితనాన్ని ఎంతవరైనా చాటే ధీరత్వం అడవిదున్నలకు సొంతం. దాదాపుగా ఎనిమల్ ప్లానెట్ చానల్‌లో కనిపించే పలు దృశ్యాల్లో సింహాలు, పెద్దపులులను సైతం మట్టికరిపించేంతగా అడవిదున్నలు సాహసాన్ని ప్రదర్శిస్తాయి. పైగా ఇవి సమూహాలుగా ఉండటం వల్ల వీటిపై దాడి చేసేందుకు కూడా శక్తివంతమైన వన్యప్రాణులు కూడా వెనకడుగు వేస్తాయి. కాగా సుమారు అడవిదున్నలు 800 నుంచి 1500 కేజీల వరకు భారీ పరిమాణాన్ని కలిగి ఉండి శరీరమంతా నలుపు రంగు, మోకాళ్ల నుంచి గిట్టెల వరకు నాలుగు కాళ్లు తెలుపు రంగులో ఉంటాయి. అలాగే కొమ్ములు అర్ధ చంద్రాకారంలో ఉండి చెవులు కాస్త లేత ఎరువు రంగులో కనిపిస్తాయి. నుదురు భాగం మాత్రం కొండను ఢీకొట్టేంత బలాన్ని ఉండటంతోపాటు చర్మం అధిక మందాన్ని కలిగి ఉండటం వల్ల అడవిదున్నలను వేటాడేందుకు ఇతర వన్యప్రాణులు సాహసించలేవు. వీటి జీవిత కాలం అడవిలో 20 నుంచి 25 సంవత్సరాలు ఉండగా, జంతు ప్రదర్శన శాలల్లో 30ఏళ్ల వరకు జీవిస్తుంది. ఇవి ఒక ఈతలో ఒకటి లేదా రెండు పిల్లలకు జన్మనిస్తాయి.

అడవిదున్నలను రప్పించాలన్నది అద్భుతమైన నిర్ణయం



జీవవైవిధ్యానికి నిలయమైన నల్లమలలో ఒకప్పుడు అంతరించిపోయిన అడవిదున్నలను తిరిగి రప్పించాలని అటవీశాఖ ప్రయోగాత్మకంగా ప్రయత్నాలు చేయడం అద్భుతమైన నిర్ణయం. ఇప్పటికే డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధుల బృందం మార్కాపురం ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోని నల్లమల అడవులను పరిశీలించింది. అడవిదున్నల ఆవాసానికి నల్లమల అనుకూలమేనని పేర్కొంది. ఇదే జరిగితే నల్లమలలో మెరుగైన జీవవైవిధ్యాన్ని కల్పించడంతోపాటు అటవీ రక్షణకు కూడా తోడ్పాటునందించినట్లవుతుంది. నల్లమలలో వేసవి కాలంలో ఎండుగడ్డి వల్ల అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అయితే శాఖాహారి (హెర్బీవోర్స్) అయిన అడవిదున్నలు ఎప్పటికప్పుడు గడ్డి తినడం వల్ల అడవిలో అగ్నిప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుంది.

- వీ సాయిబాబా, ప్రాజెక్టు టైగర్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు

ఐదు నెలల క్రితమే నల్లమలలో కనిపించిన అడవిదున్న

దక్షిణ భారతదేశంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, తమిళనాడు, తెలంగాణ, ఏపీ, కేరళ తదితర రాష్ట్రాల్లో అడవిదున్నల ఉనికి ఉంది. ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం అడవిదున్నను తమ రాష్ట్ర జంతువుగా ఎంపిక చేసింది. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా పరిసర అటవీ ప్రాంతాల్లో అడవిదున్నల ఆవాసం ఉన్నప్పటికీ ఇటీవల అక్కడి నుంచి ఒకటో రెండో అడవిదున్నలు దారితప్పి నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ ప్రాజెక్ట్‌లోని వెళ్లినట్లు తెలిసింది. అయితే తాజాగా ఐదు నెలల క్రితం ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోని బైర్లూటి, వెలుగోడు రేంజుల్లో కూడా ఒక అడవిదున్న సంచారాన్ని అటవీ అధికారులు గుర్తించారు. కెమెరా ట్రాప్స్ ద్వారా ఎప్పటికప్పుడు దీని కదలికపై నిఘా ఉంటుంది. అయితే నల్లమలలోకి ఎక్కడి నుంచి వచ్చిందన్నది ఇప్పటికీ అటవీ అధికారులు చెప్పలేకపోతున్నారు. తెలంగాణలోని అమ్రాబాద్ అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చి ఉండవచ్చునని పలువురు భావిస్తున్నారు. కానీ ఒకప్పుడు అంతరించిపోయిన అడవిదున్న నల్లమలలో కనిపించడంతో పర్యావరణ ప్రేమికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అడవిదున్నల ఆవాసానికి నల్లమల అనుకూలమేనా..?

జీవవైవిధ్యానికి ప్రతీకగా నిలిచే నల్లమల అడవులు అడవిదున్నల ఆవాసానికి అనుకూలమేనా..? అన్నది కొంతమేర ప్రశ్నార్థకంగానే ఉంది. ఎందుకంటే ప్రస్తుతం మన రాష్ట్రంలోని సతతహరిత అరణ్యమైన పాపికొండల నేషనల్ పార్క్‌లో అడవిదున్నలు ఆవాసం ఆశాజనకంగానే ఉంది. అయితే ఈ అడవులు ఎప్పుడు పచ్చదనాన్ని సంతరించుకోవడంతో పాటు గడ్డి భూములు ఉండటం వల్ల వీటి జీవనానికి ఎలాంటి విఘాతం కలగడం లేదు. అయితే నల్లమల అడవులు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఆకురాల్చు అడవులు కావడం వల్ల కొన్ని నెలలపాటు అడవంతా ఎండిపోయి కనిపిస్తుంది. అదేక్రమంలో అడవిలో వన్యప్రాణులకు నీటి కష్టాలు కూడా ఉంటాయి. ఈ పరిస్థితుల్లో వాటి జీవనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ విధానాలపై అటవీశాఖ దృష్టి సారించాల్సి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం నల్లమలలో పచ్చిక భూములను విస్తరించడంతోపాటు వీలైనంత వరకు చెరువులు, కుంటలు వంటి నీటి వనరులను సమకూర్చాలిన అవసరం ఉంది. పైగా నల్లమలలో వెదురు విస్తారంగా ఉంటుంది. దీనివల్ల ఆయా వెదురు పెరిగే ప్రదేశాల్లో ఇతర గడ్డిమొక్కలు మొలిచేందుకు అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో నల్లమలలో ఇతర గడ్డిజాతులను పెంచాల్సి ఉంటుంది.



అడవిదున్న దెబ్బకు పారిపోతున్న పెద్దపులి (ఫైల్)

నంద్యాలకు చేరుకున్న నూతన కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), జూలై 6: జిల్లాకు బదిలీ అయిన నూతన కలెక్టర్ రాజకుమారి శనివారం రాత్రి నంద్యాలకు చేరుకున్నారు. ఆమెకు నంద్యాలలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథిగృహంలో జిల్లా అధికారులు ఘనస్వాగతం పలికారు. రెవెన్యూ అధికారులు, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కొత్త కలెక్టర్ రాజకుమారికి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ అధికారులు

చిరుతపులి కోసం బోన్లు సిద్ధం

మహానంది, జూలై 6: మహానంది పరిసర ప్రాంతంలో సంచరిస్తున్న చిరుతపులిని బంధించేందుకు అటవీ శాఖ ఎట్టకేలకు ఇనుప బోన్లను సిద్ధం చేసింది. శనివారం ప్రత్యేక వాహనంలో మహానంది సమీపంలోని పర్యావరణ విద్యా కేంద్రానికి బోన్లను చేర్చారు. క్షేత్ర సమీపంలో నల్లమల అటవీ ప్రాంతాన్ని టైగర్ జోన్‌గా ప్రకటిస్తూ గతంలోనే అటవీశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నల్లమల వన్య మృగాల సంతతి విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలోనే రాత్రి వేళల్లో ఓ చిరుతపులి దేవస్థానం గోశాల వద్ద సంచరించిన దృశ్యాలు సీసీ పుటేజీల్లో కనిపించాయి. మరోసారి శుక్రవారం తెల్లవారుజామున చిరుతపులి సంచరించడంతో అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్తగా రెండు బోన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే చిరుత సంచరించిన ప్రదేశాలను గుర్తించారు. చిరుతను బంధించడానికి ఉన్నత స్థాయి అధికారుల అనుమతి కోసం కింది స్థాయి సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

మళ్లీ చిరుతపులి కలకలం

మహానంది పరసరాల్లో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. దేవస్థానం ఉద్యోగుల కాలనీలోని సరిహద్దు అటవీ ప్రాంతంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో సంచరించినట్లు స్థానిక కాలనీ ప్రజలు తెలిపారు. నల్లమల అడవి నుంచి వచ్చి కుక్కను నోట కర్చుకొని వెళ్లిందని చెబుతున్నారు. ప్రాణ నష్టం జరగకముందే చిరుతను బంధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మహానంది అటవీ పర్యావరణ విద్యా కేంద్రంలో చిరుతపులిని బంధించేందుకు సిద్ధంగా ఉంచిన బోన్లు

సీఎంల భేటీలో మంత్రి బీసీ



సీఎంలు చంద్రబాబు, రేవంత్‌తో కలసి వెళ్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 6: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విభజన అంశాలపై శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు. ఏపీ, తెలంగాణ సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డిలతో పాటు రెండు రాష్ట్రాల నుంచి ముగ్గురు చొప్పున మంత్రులు పాల్గొన్నారు. వీరి బృందంలో మంత్రి బీసీ జనార్దన్ కూడా ఉన్నారు. సమస్యలను సానుకూల వాతావరణంలో పరిష్కరించుకునే దిశగా చర్చలు సాగినట్లు మంత్రి బీసీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సమావేశానికి హాజరైన బీసీ జనార్దన్ రెడ్డి తెలంగాణ మంత్రులు, అధికారులు జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



ఇసుక ఇక ఉచితం : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), జూలై 6: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక విధానం అమలుపై ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ప్రతిరోజూ ఐదు వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందన్నారు. ఇసుక నిల్వలు, స్టాక్ పాయింట్లు జిల్లాలో లేని కారణంగా సమీప జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలోని స్టాక్ పాయింట్ల నుంచి రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కర్నూలు జిల్లా కౌతాళం మండలంలోని గుడి కంబాలి స్టాక్ పాయింట్, కడప జిల్లా కొండాపురం మండలంలోని కె.వెంకటాపురం, సిద్దవటం మండలంలోని జ్యోతి, వీఎన్‌పల్లి మండలంలోని ఎర్రబల్లి స్టాక్‌పాయింట్ల నుంచి ఉచిత ఇసుకను వినియోగదారులు రవాణా చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉచిత ఇసుక నిల్వల స్టాక్ పాయింట్లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద వినియోగదారుడు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబర్లతో వెళ్లి ఇసుక తవ్వకానికి లోడింగ్‌కు ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.335 చొప్పున డిజిటల్ పేమెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి వినియోగదారుడు 20మెట్రిక్ టన్నుల వరకు ఇసుక తీసుకోవచ్చన్నారు. డీజీఎం పోర్టల్‌లో లాగిన్ అయితే స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక నిల్వలు వినియోగాదారులకు కనిపిస్తాయన్నారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

శ్రీశైలం, జూలై 6: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి,అమ్మవార్లను శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబు దంపతులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబు దంపతులు రత్నగర్భ గణపతి స్వామిని దర్శించుకుని రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో జస్టిస్ ఎ.వి రవీంద్రబాబు దంపతులకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. తరువాత ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు జస్టిస్ ఎ.వి రవీంద్ర బాబుకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.



ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ఏవీ రవీంద్ర బాబు దంపతులు

మల్లన్న సేవలో తెలంగాణ ఎమ్మెల్యేలు

శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం తెలంగాణ రాష్ట్ర ఐదుగురు ఎమ్మెల్యేలు దర్శించుకున్నారు. ఎమ్మెల్యేలు సంపత్, రాజేష్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేగా రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకురు. తెలంగాణ పర్యాటకశాఖ సేవలను మరింత విస్తరించేందుకు స్టడీటూర్‌లో భాగంగా ఎమ్మెల్యేలు శ్రీశైలం అక్కమహాదేవి గుహలను సందర్శించారు.

ఇసుక... సులభమిక..!



గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా సాగిన ఇసుక దోపిడికి టీడీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. ఉచిత ఇసుక పాలసీ అమలుకు సై అంది. సోమవారం నుంచి గుర్తించిన రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు విధివిధానాలు ఖరారు చేశారు. కేవలం నదిలో ఇసుక తవ్వి ఒడ్డున చేర్చడం, లోడింగ్ చేయడం, సీనరేజ్ చార్జీలు మినహా ప్రభుత్వం అదనంగా ఒక్కపైసా కూడా వసులు చేయడం లేదు. సీనరేజ్ అమౌంట్‌ను కూడా స్థానిక సంస్థల అభివృద్ధి కోసం పంచాయతీ ఖాతాలకు జమ చేస్తారు. జిల్లాలో ఎక్స్‌కలేషన్ చార్జీ, రాయల్టీ, డీఎంఎఫ్, అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.675 ఉండేది. వినియోగదారులకు రూ.340 ఆదా అవుతుందని మైనింగ్ అధికారులు అంటున్నారు. ఉచిత ఇసుక పాలసీ, విధివిధానాలను శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వివరించారు.

కర్నూలు, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం కౌతాళం మండలం నదిచాగి వద్ద 9.8 హెక్టార్లు, గుడికంబాళి వద్ద 10 హెక్టార్లు, మరళి వద్ద 5 హెక్టార్లు ఓపన్ ఇసుక రీచ్‌లు, సి.బెళగల్ మండలం పరిధిలో కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీసిల్టేషన్ రీచులు (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు, భూగర్భ వనరుల శాఖ అధికారులు గుర్తించారు. వైసీపీ ప్రభుత్వంలో జేపీ పవర్ సంస్థ, ఆ తరువాత ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థలకు ఇసుక తవ్వకాలు, రవాణా లీజుకు ఇచ్చారు. గత నెల 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలుకు శ్రీకారం చుట్టారు. అదే సమయంలో లీజు కాంట్రాక్ట్ సంస్థలు ఒప్పందాన్ని కూడా రద్దు చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 8వ తేది నుంచి నూతన విధానం అమలు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టన్ను ఓపన్ రీచ్‌ల్లో రూ.475, కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల డీసిల్టింగ్ రీచ్‌ల్లో రూ.675 విక్రయించేవారు. ఇసుక అమ్మ కాలను రద్దు చేసిన చంద్ర బాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఉచితంగా ఇసుకను ఇస్తున్నప్పటికీ సీనరేజ్, లోడింగ్, రవాణా చార్జీలను వినియోదారులే భరించాల్సి ఉంటుంది.

టన్ను ఇసుకకు నిర్ణయించిన ధర

వివరాలు	ధర
ఎక్స్‌కలేషన్ చార్జీ	రూ.144
సీనరేజ్	రూ.88
లోడింగ్	రూ.30
అడ్మినిస్ట్రేషన్ చార్జీ	రూ.20
జీఎస్‌టీ	రూ.53
మొత్తం	రూ.335

టిప్పరుపై రూ.8 వేలు ఆదా

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ కృష్ణకాంత్, మైనింగ్ డీడీ రాజశేఖర్ సహా సబంధిత అధికారులు శనివారం సమావేశమై జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ అమలుపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఇసుక రవాణా, రేటు నిర్ణయంపై పూర్తిగా జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ)కి అప్పగించారు. ఆ కమిటీ సీనరేజ్, లోడింగ్, ఎక్స్‌కలేషన్, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 రేటు నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద డీసిల్టింగ్ రీచ్‌ల్లో టన్ను రూ.675గా ఉండేది. తాజాగా జిల్లా కమిటీ రూ.335 నిర్ణయించింది. అంటే టన్నుకు రూ.340 చొప్పున 24 టన్నుల టిప్పరుపై రూ.8,160 వినియోదారుడికి ఆదా అవుతుంది. అదే కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాళి, మరళి ఓపన్ రీచ్‌ల వద్ద టన్ను రూ.475 ఉండేది. అక్కడ టన్నుకు రూ.140 ప్రకారం 24 టన్నుల టిప్పరుపై రూ.3,360 ఆదా అవుతుంది. ప్రస్తుతం కౌతాళం మండలం గుడికంబాలి స్టాక్ పాయింట్‌లో 29,351 టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు పేర్కొన్నారు.

పకడ్బందీగా ఉచిత ఇసుక పాలసీ అమలు

పి.రంజిత్ బాషా, జిల్లా కలెక్టరు

ఉచిత ఇసుక విధానం పక్కాగా అమలు చేస్తాం. ఎక్స్‌కలేషన్, లోడింగ్, సీనరేజ్ (రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్), అడ్మినిస్ట్రేషన్ చార్జీలు, జీఎస్‌టీ కలిపి టన్నుకు రూ.335 ధర నిర్ణయించాం. గతంలో డీషిల్టింగ్ రీచ్‌ల్లో టన్ను రూ.675 ఉండేది. ఈ విధానం వల్ల టన్నుకు రూ.340 ఆదా అవుతుంది. సోమవారం నుంచి ఈ విధానం అమలుల్లోకి వస్తుంది. ఇసుక డిపోల వద్ద వీఆర్‌ఏ లేదా వీఆర్‌ఓలను ఇన్‌చార్జిలుగా నియమిస్తాం. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక రవాణా చేయవచ్చు. ఎక్కడైనా అక్రమాలు జరిగితే స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిలదే బాధ్యత. వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయి. ఇసుక రవాణా వివరాలు ఎప్పటికప్పుడు తనకు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం గుడికంబాలి స్టాక్ పాయింట్ వద్ద 29,351 టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. కౌతాళం తహసీల్దారు పంచనామా చేసి ఇసుకను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించాం. సి.బెళగల్ మండలంలోని కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, ఉడుమాల, పల్లెదొడ్డి వద్ద ఉన్న డీసిల్టింగ్ రీచ్‌లకు పర్యావరణ అనుమతులు రాగానే వినియోగంలోకి తీసుకొస్తాం. ఈసీ అనుమతుల కోసం మైనింగ్ డీడీని ఆదేశించాం. ప్రతి డీసిల్టింగ్ పాయింట్ వద్ద ఒకరిని ఇన్‌చార్జిని నియమించేలా ఆర్డీఓను ఆదేశించాం.

- సీనరేజ్, లోడింగ్ చార్జీలు మాత్రమే వసూలు
- టన్నుకు రూ.335 రేటు నిర్ణయించిన జిల్లా కమిటీ
- నేటి నుంచి అందుబాటులోకి ఇసుక
- గుడింకబాలి వద్ద అందుబాటులో 29,351 టన్నులు



గుడికంబాళిలోని ఇసుక రీచ్

ఇసుక పాలసీపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(కలెక్టరేట్), జూలై 6: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ.జి.కృష్ణకాంత్‌తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గనుల శాఖ డీడీ రాజశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాటసాని నుంచి ప్రాణహాని

- మల్లెల రాజశేఖర్ సంచలన ఆరోపణలు
- ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

కల్లూరు, జూలై 6: పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందని నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శనివారం ఆయన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. పాణ్యం నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రహిత పాలనే తమ లక్ష్యమని, అందుకు సహకరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని ఓటమిని జీర్ణించుకోలేక పచ్చని గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో కాటసాని ఓటమికి ప్రధాన కారణం తానే అని కక్ష గట్టారని మల్లెల రాజశేఖర్ అన్నారు. అలాగే యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌ను దూషించడంతో నాలుక కోస్తా అని పేపరు ప్రకటన ఇచ్చానని, అప్పటి నుంచి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డి తనపై ద్వేషం పెంచుకున్నారని వివరించారు. హుసేనాపురం గ్రామానికి చెందిన జీకే వెంగళరెడ్డి, గుర్రాల చెన్నారెడ్డి, లోటస్ బాషాలతో కలిసి తనను అంతమొందించేందుకు వ్యూహం పన్నుతున్నారని తెలిసిందని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బొమ్మిరెడ్డిపల్లెలో తెలుగుదేశం పార్టీ వాడిని చంపినట్లు మల్లెల రాజశేఖర్‌ను కూడా నరికి చంపండని, మిగతా సంగతి తాను చూసుకుంటానని చెప్పినట్లు తెలిసిందన్నారు. లోటస్ బాషా ఈ విషయాలను గ్రామ సర్పంచు గోవర్ధనమ్మ భర్త కురువ పెద్దస్వామితో చెప్పారని ఎస్పీకి వివరించారు. గ్రామ వైసీపీ నాయకులపై కేసు నమోదు చేసి తనకు రక్షణ కల్పించాలని కోరారు.

పట్టపగలే దొంగతనం

8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల అపహరణ

బేతంచెర్ల, జూలై 6: పట్టణంలో సెంట్ ఆన్స్ పాఠశాల ఎదురుగా ఉన్న కాలనీలో నివాసం ఉంటున్న వెంకటరమణ ఇంట్లో పట్టపగలే దొంగలు పడ్డారు. 8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల నగదును దోచుకెళ్లారు.. వెంకటరమణ తన కోడలు లక్ష్మీఅరుణ గర్భిణి కావడంతో ఉదయం 9 గంటలకు శాంతిరాం హాస్పిటల్‌కు వెళ్లాడు. వెంకట రమణ కుమారుడు గిరీష్ కుమార్ వర్క్‌షాపు నుంచి సాయంత్ర 4 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళం తీసి ఉంది. దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ శివశంకర్ నాయక్ తన సిబ్బందితో దొంగతనం జరిగిన సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. రెండు బీరువాల లాకర్‌ను పగుల కొట్టి 8.50 తులాల బంగారు, రూ.1.30 లక్షల నగదు అపహరించుకుని వెళ్లారని బాధితుడు ఎస్ఐకు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్నూలు ఎంపీకి ఘన స్వాగతం



కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలుకుతున్న మిత్రులు

డోన్(రూరల్), జూలై 6: పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసి కర్నూలు జిల్లాకు వచ్చిన కర్నూలు జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన మిత్ర బృందం నుంచి ఘన స్వాగతం పలికింది. కర్నూలు జిల్లా కేంద్రం సమీపంలోని పంచలింగాల దగ్గర కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు ఆయన మిత్ర బృందం డోన్, ఎరుకులచెరువుకు చెందిన వ్యాపారవేత్తలు దస్తగిరి, సాయి శివకుమార్‌లు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. కర్నూలు ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి రావడంపై హర్షం వ్యక్తం చేశారు.

అలా కానిచ్చేశారు..!

- మొక్కుబడిగా సాగిన స్థాయి సంఘాల సమావేశం
- మౌనం పాటించిన జడ్పీటీసీలు
- ఆర్అండ్‌బీ రోడ్డుపై దుమారం



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: ప్రతీసారి వాడివేడిగా జరిగే జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు శనివారం మాత్రం మొక్కుబడిగా కానిచ్చేశారు. ఉమ్మడి జిల్లాలోని సమస్యలను లేవనెత్తడంలో జడ్పీటీసీలు మౌనం వహించారు. ఒకరిద్దరు మినహా మరెవరూ గట్టిగా వాదనలు చేయలేకపోయారు. అధికారుల దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కరించడానికి కృషి చేయాల్సిన జడ్పీటీసీలు వాటి గురించి పట్టించుకోకపోవడం గమనార్హం. ఏదో కొన్ని సమస్యలను కొందరు ప్రశ్నించి మొక్కుబడిగా జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలను పూర్తి చేశారు. శనివారం జిల్లా పరిషత్ మినీ సమావేశభవనంలో ఏడుస్థాయి సంఘాల సమావేశం సీఈఓ జి.నాసరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఉమ్మడి జిల్లా అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా చేసిన పనులకు బిల్లులు 8 నెలలుగా అందడం లేదని, బిల్లులు వస్తాయా.. రావా? నీరు-చెట్టు బిల్లుల కోసం కోర్టుకు వెళ్లినట్లు వెళ్లాలా? అంటూ ఒకరిద్దరు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

రోడ్డు వేస్తే కేసులా..?

కొలిమిగుండ్ల మండల తుమ్మలపెంట గ్రామం వద్ద ఒక సిమెంటు కంపెనీ ద్వారా రూ.70 లక్షల విలువతో రోడ్డు వేయిస్తే కేసులు పెట్టడం సమంజసం కాదని, కేసును ఉపసంహరించుకోవాలని ఆర్అండ్‌బి ఈఈ శ్రీధర్‌రెడ్డిని జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి కోరారు. 'మీరు రోడ్లు వేయరు..వేసిన వారిని ఎందుకు వేధిస్తు న్నారు..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాళ్లు ఏదో ఫ్యాక్టరీ కోసం రోడ్డు వేసు కుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని పలువురు జడ్పీటీసీలు అసహనం వ్యక్తం చేశారు.

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చైర్మన్ ఆగ్రహం

జిల్లాలో తాగునీటిపై శ్రద్ధ వహించడం లేదని జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సమస్య వచ్చినప్పుడు.. పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పుడు మాత్రమే హడావుడిగా సంబంధిత గ్రామాలకు వెళ్లి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న తరుణంలో ఎలాంటి ప్రణాళికలు చేయడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరావుపై చైర్మన్ మండిపడ్డారు. గ్రామీణ ప్రజలకు శుద్ధజలాన్ని ఎప్పుడు అందిస్తారని చైర్మన్ ఎస్ఈని ప్రశ్నించారు. అపరిశుభ్రమైన నీరు తాగడం వల్ల రోగాల బారిన పడుతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయకపోవడం వల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని చైర్మన్ స్పష్టం చేశారు. ఇందుకు స్పందించిన ఎస్ఈ గత నెల 18 నుంచి 30 వరకు తాగునీటి పథకాలు, ఓహెచ్ఆర్‌లను శుభ్రం చేశామని వివరించారు.

నిండా మోసం..!

- పెట్టుబడి సొమ్ము పరులపాలు
- నిలదీసిన రైతులకు రాయితీ బదిలీ
- సచివాలయ ఉద్యోగుల చేతివాటం

ఆదోని రూరల్, జూలై 6: జిల్లాలోని పలు గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రైతులను ముంచేసి వారికి న్యాయంగా రావాల్సిన నిధులను పక్కదారి పట్టిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారుల నిర్వాకం వల్ల నిజమైన లబ్ధిదారులకు పెట్టుబడి రాయితీ దక్కడం లేదు. పైగా వైసీపీ నాయకులు, అధికారుల బంధువర్గాల ఖాతాల్లో ఈ సొమ్ము జమ కావడం ప్రస్తుతం ఆదోని నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఆదోని మండలంలో 30 సచివాలయ పరిధిలో 37 ఆర్బీకేలు ఉన్నాయి. ఇందులో వ్యవసాయ సహాయక అధికారులు 30మంది, ఎంపీఈఓలు ఏడుగురు విధులు నిర్వహిస్తున్నారు. 2023-24 కరువు మండలంగా ఆదోనిని ప్రభుత్వం ప్రకటించింది. 18,496 హెక్టార్ల భూమికి సంబంధించి 21,933 మంది రైతులకుగాను రూ.30.77 కోట్లకు అధికారులు పెట్టుబడి రాయితీ అవసరమని నివేదిక పంపారు. సార్వత్రిక పోలింగ్ అనంతరం ప్రభుత్వం రైతులకు పెట్టుబడి రాయితీని వారి ఖాతాల్లో వేశారు.

మ్యానువల్ మాయాజాలం: రైతులకు పెట్టుబడి రాయితీ విషయంలో అధికారులు మ్యానువల్‌గా రైతుల వివరాలను తీసుకొని ప్రభుత్వానికి పంపుతారు. ఇక్కడే వ్యవసాయ సహాయక అధికారులు తమ మాయాజాలాన్ని చూపించారు. రైతుల సర్వే నంబర్ ఖాతా నెంబర్లకు వీరి అనుకూలమైన వారి బ్యాంకు అకౌంట్ నెంబర్‌తోపాటు ఐఎఫ్‌సీ కోడ్‌ను జత పరిచి నివేదికలు పంపారు. అది కూడ 30 మంది రైతులకు పడాల్సిన పెట్టుబడి రాయితీ పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఓ వ్యవసాయ సహాయక అధికారి సామాజిక వర్గానికి చెందిన వారి ఖాతాలో పడటం గమనార్హం. ఆదోనికి చెందిన ఇద్దరు రైతుల భూములు బైచిగేరి పంచాయితీ పరిధిలో ఉన్నాయి. వీరు కూడా పెట్టుబడి రాయితీకి ఎంపికయ్యారు. కానీ వీరి ఖాతాల్లో పడాల్సిన రూ.25వేల డబ్బులు అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడి బ్యాంకు ఖాతాలో పడ్డాయి. విషయం తెలుసుకున్న ఆ ఇద్దరు రైతులు సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయ అధికారికి ఫోన్ చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీంతో అధికారులు, సదరు వైసీపీ నాయకుడు విషయం బయటకు పొక్కకుండా చర్యలు తీసుకున్నారు. ఆ రైతులకు వైసీపీ నాయకుడి ద్వారా రూ.20వేలు ఇప్పించాడు. పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఐదు నుంచి 10మంది రైతులకు పైవిధంగానే సంబంధిత ఆ గ్రామ అధికారి పెట్టుబడి రాయితీని తిరిగి వేయించారు. రైతుల ఖాతాల్లో పడాల్సిన డబ్బు ఇతరులకు వెళ్లడంలో సచివాలయ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉన్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా గోనెగండ్ల మండలంలోని కైరవాడి, ఎర్రబాడు, పెద్దనెలటూరుతో పాటు ఆదోని మండలంలోని చిన్నహరివాణం, బల్లేకల్లు, తదితర గ్రామాల్లో కూడా పలువురు అధికారులు ఇలాంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.



పెద్దహరివాణం ఆర్బీకే సెంటర్

ఫిర్యాదులు వచ్చాయి.. విచారణ చేస్తున్నాం

పెద్దహరివాణం గ్రామానికి చెందిన 10మంది రైతులు జాబితాలో తమ పేర్లున్న తమకు పెట్టుబడి రాయితీ పడలేదని, రైతుల ఖాతాలకు కాకుండా ఇతరుల ఖాతాల్లో నగదు జమఅయిందని ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా విచారణ చేస్తున్నాం. నిజానిజాలు తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-అశోక్ కుమార్‌రెడ్డి, ఏఓ ఆదోని

సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతన వెతలు

రెండు నెలల నుంచి జీతాలు పెండింగ్

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 6: జిల్లా సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతన కష్టాలు తప్పడం లేదు. గత రెండు నెలల నుంచి జీతాలు అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ కష్టాలు గట్టెక్కుతాయని భావించారు. అయినా వారి కష్టాలు పరిష్కారం కాలేదు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చేది అరకొర వేతనమే. అది కూడా చెల్లించకపోవడంతో ఇటు ఉద్యోగ బాధ్యతలను, అటు కుటుంబ పోషణ నిర్వహించలేక సతమతమవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో సమగ్ర శిక్ష డీపీవో, మండల స్థాయిలో అన్ని కేటగిరీల ఉద్యోగాల పోస్టులు 586 ఉన్నాయి. ఇందులో 167 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీలు) 151, మండల స్థాయి అకౌంటెంట్లు 26, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 7, ఎంఐఎస్ కోఆర్డినేటర్ 26, ఐఈఆర్‌టీఎస్ 52, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్ 258, మండల స్థాయిలో డేటా ఆపరేటర్లు 26, మెసింజర్స్ 26, డీపీవో ఆఫీసు సబార్డినేట్ 6 పోస్టులు ఉన్నాయి. అన్ని కేటగిరీలో కలిపి 412 మంది మాత్రమే పని చేస్తున్నారు. 167 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మే, జూన్ నెలల జీతాలు ఉద్యోగులకు జమ కాలేదు. ఈ ఉద్యోగులే కాకుండా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వ ర్యంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 36 మోడల్ స్కూల్స్ హాస్టల్‌లో వార్డెన్లు, కుక్‌లు, అసిస్టెంట్ కుక్‌లు, వాచ్‌మెన్లు కలిపి దాదాపు 150 మంది వరకు పని చేస్తున్నారు. ఉద్యోగులకు జీతాలు అందకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పథకాలకు దూరం

సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కింద పని చేసే ఉద్యోగులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తించడం లేదు. ప్రతి విద్యార్థికి ఇచ్చే అమ్మఒడి, చేతివృత్తుల కింద మహిళలకు ఇచ్చే ఆర్థిక సాయానికి కూడా దూరమయ్యారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నామమాత్ర వేతనాలు చెల్లిస్తోందని, దీనికి తోడు పథకాలకు అనర్హులుగా ప్రకటించడం ఈ ఉద్యోగులు చేసుకున్న నేరమా అని మదనపడుతున్నారు. జూన్, జూలై నెలల్లో విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో తమ పిల్లల బడి ఫీజులు, బస్సు చార్జీలు, యూనిఫాం, పుస్తకాలు, స్టేషనరీ వంటి ఖర్చులు భరించాల్సి వస్తోంది. నెలనెలా రావాల్సిన జీతాలు ప్రభుత్వం జమ చేయకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. రెగ్యులర్ ఉద్యోగులుగా మాదిరిగానే తమకు నెలా నెలా జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

బడ్జెట్ విడుదల చేయాలి



ఏడాదికి ఒకేసారి ఉద్యోగులకు సరిపడా బడ్జెట్ విడుదల చేయాలి. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పార్ట్‌టైమ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మే, జూన్ నెలల్లో వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సమ్మె కాలం జీతాలు కూడా చెల్లించాలని కోరారు.

- ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ మహమ్మద్ రఫీ

రెగ్యులర్ వేతనాలు చెల్లించాలి



రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి. సమ్మె కాలానికి పెండింగ్‌లో ఉన్న వేతనంతో పాటు ఉద్యోగులకు పెంచిన జీతాలు కలిపి ఇవ్వాలి. ప్రభుత్వ పథకాలు కూడా ఈ ఉద్యోగులకు అమలు పరచాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఏపీ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి: మంత్రి ఫరూక్



ఈద్గాలో మొక్క నాటుతున్న మంత్రి ఫరూక్

నంద్యాల (నూనెపల్లె/కల్చరల్), జూలై 6: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పిలుపు నిచ్చారు. నంద్యాల ఎస్ఆర్బీసీ రోడ్డు సమీపంలో తోయిబా ఈద్గా ఆధ్వర్యంలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ ఇంటి ఆవరణలో, పొలాల గట్లపై కార్యాలయాల ఆవరణాలలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. పచ్చదనంలో నంద్యాల నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకుల ఎన్ఎండీ ఫయాజ్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఈద్గా కమిటీ సభ్యులు, మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి'



స్టూడెంట్ కిట్‌ను అందజేస్తున్న టీడీపీ నాయకులు

పగిడ్యాల, జూలై 6: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉపాధ్యాయులు మెరుగైన విద్యను అందజేసి వారిని ప్రయోజకులుగా తీర్చిద్దిదాలని టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని పడమర ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన స్టూడెంట్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ పెద్దల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సువర్ణమ్మ, గ్రామస్థులు నాగశేషులు, బాబు, తదితరులు ఉన్నారు.

'హంస' తాలుకా కార్యవర్గం ఎన్నిక

నందికొట్కూరు, జూలై 6: పట్టణంలోని ఎన్జీవోస్ భవనంలో హంస నందికొట్కూరు తాలుకా నూతన కార్యవర్గం శనివారం ఎన్నికైంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు రఘుబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏపీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు రాముడు, సత్యనారాయణ ఆధ్వర్యంలో హంస నూతన కార్యవర్గం ఏర్పాటైంది. హంస నూతన కార్యవర్గం నందికొట్కూరు తాలుకా అధ్యక్షుడిగా జగపతి(ఎంపీహెచ్ఏ, పగిడ్యాల), సహ అధ్యక్షులుగా వహీబ్(సీహెచ్‌వో, జూపాడుబంగ్లా), కార్యదర్శిగా చెంచన్న(ల్యాబ్ టెక్నీషియన్, పీహెచ్‌సీ జూపాడుబంగ్లా), కోశాధికారిగా అనురాగ్(జూనియర్ అసిస్టెంట్ సీహెచ్‌సీ, మిడ్తూరు), ఉపాధ్యక్షులుగా జబీను, పుష్పావతి, శివగౌరి, ఆర్గనైజింగ్ సెక్రటీలు సల్మాన్, నిర్మల జ్యోతి, జాయింట్ సెక్రటరీలు చంద్రనాయక్, శ్రీలత, రమాదేవి, పద్మావతి, ఈ.సీ సభ్యులు శ్రీజ, చంద్రావతి, శంషాద్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి, కరుణాకర, గుర్రప్ప, సీహెచ్‌వో, మిగతా ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాయకుడిపై ఫిర్యాదు

జూపాడుబంగ్లా, జూలై 6: తరిగోపుల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గిరీశ్వరరెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేశారని, ఆయనపై కేసు నమోదు చేయాలని సర్పంచ్ నిర్మలమ్మ జూపాడుబంగ్లా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల పోతులపాడు మజారా గ్రామం చాబోలులో ఓ వ్యక్తి అతిసారతో చనిపోయాని, సర్పంచ్ నిర్మలమ్మ, ఆమె కుమారుడు శివానందరెడ్డి దీనికి బాధ్యులని టీడీపీ నాయకుడు గిరీశ్వరరెడ్డి ఆరోపించడం సరికాదని అన్నారు. ఆ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని అన్నారు. తన కుమారుడు తెలంగాణ మద్యం విక్రయిస్తున్నాడని, ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించడం సరికాదని, గిరీశ్వరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వీసు రోడ్డుకు మోక్షమెన్నడో?

● ప్రమాదకరంగా మారిన పిన్నాపురం సర్వీస్ రోడ్డు

పాణ్యం, జూలై 6: మండలంలోని పిన్నాపురం గ్రామానికి వెళ్లే సర్వీస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. కర్నూలు నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలు జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్తూ హఠాత్తుగా అడ్డుగా వచ్చిన వాహనాలను గమనించక ప్రమాదానికి గురవుతున్నాయి. పిన్నాపురం నుంచి నిత్యం గ్రామస్థులు, విద్యార్థులు ఆటోలలో, మోటారు సైకిళ్లపై పాణ్యానికి వెళ్తుంటారు. ఇదే సమయంలో పిన్నాపురం రహదారి నుంచి జాతీయ రహదారిని ఎక్కాల్సిన చోట ఎగువగా ఉండడంతో పాటు నేరుగా జాతీయ రహదారిని ఎక్కడంతో జాతీయ రహదారిపై అతివేగంగా వెళ్లే వాహనాలకు పిన్నాపురం నుంచి వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల పిన్నాపురం నుంచి సుగాలిమెట్టకు వెళ్తున్న వ్యవసాయ కూలీల ఆటోను కర్నూలు నుంచి వచ్చే కారు అతివేగంగా ఢీకొనడంతో 15 మంది గిరిజనులు ప్రమాదానికి గురయ్యారు. ఈ సమస్యకు పరిష్కారాన్ని గుర్తించి ప్రభుత్వాధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో సుగాలిమెట్ట, పిన్నాపురం గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సుగాలిమెట్ట నుంచి పిన్నాపురం క్రాస్ రోడ్డు వరకు దాదాపు 300 మీటర్ల మేర వేయాల్సిన సర్వీసు రోడ్డుపై పలు మార్లు ప్రజాసంఘాలు విన్నవించినా జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుగాలీలు నిత్యం వేలాది పశువులను సమీప అటవీ ప్రాంతానికి తోలుకొని వెళ్లే సమయంలో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలకు ఎదురుగా వెళ్లాల్సి వస్తోంది. పలుమార్లు పశువులు వాహనాలకు బలివ్వాల్సి వచ్చింది. సర్వీసు రోడ్డు వేస్తే రెండు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలి

పిన్నాపురం క్రాస్ రోడ్డు వరకు సుగాలిమెట్ట నుంచి సర్వీసు రోడ్డు వేయడంతో ప్రమాదాలు నివారించవచ్చు. పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా చలనం లేదు. ఇదే పరిస్థితి ఏర్పడితే జాతీయ రహదారిపై ఆందోళన చేపడతాం. జాతీయ రహదారుల అధికారులు జిల్లాలో ఎక్కడ ఉండేది ప్రజలకు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారుల అధికారుల కార్యాలయం చిరునామాను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

- చంద్రానాయక్, టీడీపీ నాయకుడు, సుగాలిమెట్ట



పిన్నాపురం నుంచి జాతీయ రహదారి ఎక్కే ప్రదేశం

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు: ఎమ్మెల్యే బుడ్డా



ఎర్రగుంట్లలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



గట్టు తండా సమీపంలోని చెరువును పరిశీలిస్తున్న బుడ్డా

బండి ఆత్మకూరు, జూలై 6: నాణ్యతతో పనులు చేపట్టాలని, లేకపోతే చర్యలు తప్పవని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగుంట్ల, బండిఆత్మకూరు గ్రామాల మధ్య రూ. 3,73,20,000 పీఎంజీవై నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, రమణారెడ్డి, భరద్వాజశర్మ, నరసింహారెడ్డి, సిద్ధయ్య, బుగ్గరాముడు, ఈశ్వరరెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, రఘుస్వామిరెడ్డి, సర్పంచ్ శ్వేత కుమారి, ప్రసాద్, శంకరరెడ్డి, బాబు రెడ్డి, మహేష్, నందయ్య, జాకీర్, కరీమ్ పాల్గొన్నారు.

'రైతు సమస్యల పరిష్కారానికి కృషి'

వెలుగోడు: రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి పాటు పడతానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి అన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలోని గట్టు తండా సమీపంలో పెద్ద మల్లెలమ్మ చెరువు తూమును ఇటీవల అటవీ శాఖ అధికారులు పూడ్చి వేశారు. వన్య ప్రాణులకు నీటి కొరత రాకుండా నీరు నిలువ ఉంచేందుకు అటవీ శాఖ అధికారులు తూములు మూసి వేయడంతో రైతులు తమకు సాగు నీరు అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే రైతులు, అటవీ శాఖ అధికారి ఎంఏ ఖాన్‌తో కలిసి వారంతా శనివారం చెరువును పరిశీలించారు. రైతులు, అటవీ శాఖ అధికారుల మధ్య నెలకొన్న సమస్యను అడిగి తెలుసుకుని ఇరువురితో చర్చించారు. ఇరువురు సమస్యలు లేకుండా చెరువులో నీరు డెడ్ స్టోరేజీ కాకుండా తూమును కొంత ఎత్తు వరకు పెంచి ఆపై వచ్చే నీటిని రైతు పంటలకు అందేలా కూడాలన్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఈ ప్రతిపాదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి రైతులకు సమస్య లేకుండా చూస్తామన్నారు. అలాగే మెయిన్ కెనాల్ వెంట ఆయన పర్యటించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు అన్నారపు శేషి రెడ్డి, అబ్దుల్ కలాం, ఎల్లాల కృష్ణుడు, మండ్ల శంకర్‌రెడ్డి, ఖలీల్, వెంకటరమణ, హిదాయత్, రసూల్, బుడ్డన్న పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్జీఎం కళాశాలలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు



గురువులతో పూర్వ విద్యార్థులు

పాణ్యం, జూలై 6: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఆర్జీఎం రెకిండల్ 25ను శనివారం ఘనంగా నిర్వహించారు. 1995లో ప్రారంభమైన కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు తమ పాత రోజులను తమ మిత్రులతో పంచుకున్నారు. దేశవిదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు తమ మనోభావాలను, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడుతో పాటు తమ గురువులను ఘనంగా సన్మానించారు. ఆస్ట్రేలియా షావిక్ కార్పొరేషన్ ఫౌండర్ శ్రీకాంత్, బెంగళూరు గ్రీన్ ఎనర్జీ డైరెక్టర్ చక్రధర్‌రెడ్డి, ఓమన్ ఇంటర్‌నేషనల్ అవార్డ్స్ నిర్వాహకులు గోపీకృష్ణ, హైదరాబాదు ఐటీపీఎస్ అండ్ సర్వే ఇన్‌ఫ్రా టెక్ ఫౌండర్ సురేంద్రమోహన్, తెలంగాణలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన విజయ్ పంజా, అమెరికాకు ఉమెన్ కౌన్సిల్ నిర్వాహకులు శిరీష పులిపటి, బెంగళూరు బోస్క్ డైరెక్టర్ కరుణాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, రామిరెడ్డి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

● అనుమతి లేని విత్తన విక్రయాలు నిలిపివేత

నంద్యాల టౌన్, జూలై 6: నంద్యాలలోని పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేశారు. శనివారం వ్యవసాయ శాఖ డీటీఏ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడీఏ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. రెండు బృందాలుగా ఏర్పడి సాయి ఆగ్రో ఏజెన్సీస్, దుర్గా భవాని ఫర్టిలైజర్స్, రాయల్ ఆగ్రో ఏజెన్సీస్, గణపతి సీడ్స్, అన్నదాత సీడ్స్, రైతుమిత్ర ఆగ్రో ఏజెన్సీస్, కిరణ్ హైబ్రిడ్స్, ధరణి సీడ్స్, జయసాయి ఆగ్రో ఏజెన్సీస్, శ్రావణ లక్ష్మి సీడ్స్, తదితర విత్తన శుద్ధి కేంద్రాలలో కూడా విస్తృత తనిఖీలు చేశారు. సరైన ధృవపత్రాలు లేనందున రూ.15,43,675 విలువ చేసే విత్తనాలు, పురుగుల మందుల అమ్మకాన్ని నిలుపుదల చేసినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. నంద్యాల ఏడీఏ రాజశేఖర్, విజిలెన్స్ అధికారులు సునీల్, సిద్ధయ్య, ఏవోలు ప్రసాదరావు, అయూబ్‌బాషా, కళ్యాణ్‌కుమార్ ఉన్నారు.

మహానంది: గాజులపల్లిలోని గఫారియా పెస్టిసైడ్స్, ఎరువుల దుకాణాన్ని శనివారం వ్యవసాయశాఖ ప్రత్యేక తనిఖీ బృందం సభ్యులు డీడీఏ సుబ్రమణ్యం, విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లతో పాటు బిల్ పుస్తకాలను అధికారులు పరిశీలించారు. ఇందులో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా విక్రయిస్తున్న రూ.3,04,619 విలువ చేసే బయో ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేశారు. స్టాక్ నిల్వలను సక్రమంగా చూపక విక్రయిస్తున్న రూ.3,24,199 విలువ చేసే రసాయనిక మందుల విక్రయాలను నిలుపుదల చేశారు. టెక్నికల్ ఏవో కల్యాణ్ కుమార్, అయిబ్ బాషా, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గోసుపాడు: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను కర్నూలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ , వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలు శనివారం తనిఖీ చేశాయి. గోస్పాడులోని న్యూశంకర ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రూ.9,46,930 విలువైన ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. అధికారులు సిద్దయ్య, శ్రీనివాసరావు, ప్రసాదరావు, ఏవో స్వప్నికరెడ్డి, ఏఈవో రామకృష్ణ పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జూలై 4: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం కింద ఉన్న దత్తాత్రేయ స్వామికి లోకకల్యాణం కోసం పంచామృతాభిషేకం, విశేష పూజలు దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహా గణపతి పూజలు చేశారు.

● శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం నెల్లూరుకు చెందిన క్షేత్రిపుర నిఖిత బృందంతో కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

'విజయకేతన ర్యాలీని జయప్రదం చేయాలి'



మాట్లాడుతున్నకాకరవాడ చిన్న వెంకటస్వామి

నందికొట్కూరు, జూలై 6: నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి ఎన్నికైన తర్వాత మొదటిసారిగా నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా ఈనెల 8న పట్టణంలో నిర్వహించే విజయకేతన ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.కాకరవాడ చిన్నవెంకటస్వామి పిలుపునిచ్చారు. నందికొట్కూరు పట్టణంలో కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న బైరెడ్డి కాంప్లెక్స్‌లో నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చిన్నవెంకటస్వామి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. శుక్రవారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఎమ్మెల్యే నియోజకర్గ అభివృద్ధి కోసం తన సత్తా చాటాలే తప్ప. తన గెలుపులో భాగమైన వారిపై సత్తా చూపుతామని మాట్లాడడం ఏమిటని ఆయన అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ హాజీ షేక్ అబ్దుల్ షూకూర్, ఎస్ఎంటీ అబ్దుల్లా, రఫీఖాన్, షాకీర్ పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నంద్యాల (టౌన్/నూనెపల్లె), జూలై 6: వ్యవసాయ కూలీలకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ముఖ్య ప్రతినిధుల సమావేశాన్ని బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.50 కోట్ల మంది వ్యవసాయ కూలీలకు అండగా ఉండేందుకు అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం పార్టీ వాగ్దానం చేయడం జరిగిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిందని, నిచ్చిన వాగ్దానాన్ని టీడీపీ ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. విజయవాడలో కేరళా రాష్ట్రం తరహాలో మేధావులు, ప్రజాసంఘాలతో ఈనెల 10వ తేదీన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు చట్టాలు ఉన్నట్లుగానే కార్మికుల సంక్షేమానికి కూడా చట్టాలను అమలు చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు, నాయకులు నరసింహ నాయక్, డేవిడ్, పకీర్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

'10న ధర్నాకు అనుమతివ్వాలి'

పగిడ్యాల, జూలై 6: ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని, పని భారం తగ్గించాలని కోరుతూ ఈ నెల 10న మండల కేంద్రాలలో చేపట్టే ధర్నాకు అనుమతులు ఇవ్వాలని పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనిల్‌కు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి శనివారం వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రామకృష్ణ, ఆశా వర్కర్లు సుజాత, రమణమ్మ, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, జూలై 6: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన పి.శ్రీనివాసరావు రూ.1,11,111 విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం పర్యవేక్షకుడు నాగరాజుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, మ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

మహానందిలో రాహుకేతువు పూజలు



రాహుకేతువు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, జూలై 6: మహానంది క్షేత్రంలో ఆషాడ మాసం పురస్కరించుకొని రాహుకేతువు పూజలను శనివారం ఆలయ వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం మెదటి ప్రాంగణంలోని రాహుకేతువు మంటపాన్ని శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ, సహాయ అర్చకులు ధర్మతేజలు వేదమంత్రాలతో రాహుకేతువు విగ్రహాలకు ఉదయం గణపతి పూజా, విశేష అభిషేకంతో పాటు వివిధ ద్రవ్యాలతో రాహుకాలంలో రాహుకేతువు పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈ కార్యక్రమానికి గోపవరం గ్రామానికి చెందిన కాటంరెడ్డి ప్రసాదరెడ్డి, ప్రసన్నలక్ష్మి దంపతులతో పాటు హర్షవర్ధన్‌రెడ్డి దాతలుగా వ్యవహరించారు.

జగజ్జననీ అమ్మవారికి సారె సమర్పణ



జగజ్జననీ మాతకు పుట్టింటి పట్టుచీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల (కల్చరల్), జూలై 6: నంద్యాలలో జగజ్జననీ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా భక్తులు అమ్మవారికి చీరె సారే సమర్పించుకుంటారు. శనివారం ఆషాడమాసం సందర్భంగా మొదటి రోజు జగజ్జననీ అమ్మవారికి ఆళ్లగడ్డ, నంద్యాల, గిద్దలూరు, శివ మొగ్గ, హైదరాబాదు, కర్నూలు, డోన్, కడప నుంచి మహిళా భక్తులు పుట్టింటి చీర, సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో బాగంగా అమ్మవారిని అలంకరించి భక్తులు పట్టుచీరె-సారె తీసుకొని నంద్యాల బాలకొండహాలు నుంచి ఆత్మకూరు బస్టాండు మీదుగా అమ్మవారి వేషధారణలతో భక్తులు సింగారి మేళంతో ఊరేగింపుగా భక్తిపాటలు పాడుతూ జగజ్జననీ ఆలయానికి చేరుకున్నారు. అనంతరం జగజ్జననీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీలో చేరిక



బైరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ దేవనూరు నాయకులు

మిడుతూరు, జూలై 8: మండలంలోని దేవనూరు గ్రామానికి చెందిన సర్పంచ్ చిన్న అయ్యన్నతోపాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. నందికొట్కూరులో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో శనివారం గ్రామ సర్పంచ్ చిన్న అయ్యన్నతో పాటు కోఆప్షన్ మెంబరు పెద్ద మౌలా, ఎంపీటీసీ నవాజ్ అలీ, మాజీ ఎంపీటీసీ రామ సిద్దారెడ్డి, కృష్ణారెడ్డి, అమీర్‌తో పాటు సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జూపాడుబంగ్లా, జూలై 6: మండలంలోని జూపాడుబంగ్లా- 80బన్నూరు గ్రామాల మధ్య డీజిల్ బంకు వద్ద బర్రెలు అడ్డం వచ్చి ప్రమాదవశాత్తు మోటారుసైకిల్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పాములపాడు మండలం బానకచర్ల గ్రామానికి చెందిన నాగరాజు, శేఖర్ నందికొట్కూరుకు పని నిమిత్తం వెళ్లి తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు పడటంతో, ఈ ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలు కాగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నందికొట్కూరుకు తరలించి అక్కడినుంచి మెరుగైన చికిత్సకోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆలయ భూములకు కౌలు వేలం



ఎ.కోడూరులో వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, జూలై 6: మండలంలోని ఎ.కోడూరులో వెలసిన చెన్నకేశవ, రామేశ్వరస్వామి ఆలయాలకు చెందిన 38.51 ఎకరాలు కౌలు ఇవ్వడానికి దేవస్థానం అధికారులు శనివారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో ఈవో నాగప్రసాద్ వేలం పాటలు నిర్వహించారు. ఈ భూములకు గత ఏడాది రూ.7,80,500 రాగా ప్రస్తుత ఏడాది రూ.9,66,000లు లభించిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో రైతులు, గ్రామపెద్దలు, సిబ్బంది బాలచంద్రుడు పాల్గొన్నారు.

నీట్‌ను రద్దు చేయాలి: పీడీఎస్‌యూ



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 6: నీట్-2024 పరీక్షను తక్షణమే రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రాంబాబు డిమాండ్ చేశారు. నంద్యాలలోని పద్మావతి నగర్ ఆర్చి వద్ద శనివారం ధర్నా చేపట్టారు. రాంబాబు మాట్లాడుతూ. నీట్ పరీక్ష లీకేజిలో లక్షల కోట్ల రూపాయలు కుంభకోణం జరిగిందని, వెంటనే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్‌పై పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించాలి'



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

ఆత్మకూరు, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం, పారిశుధ్య కార్మికులపై రాజకీయ వేధింపులు మానుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రజాక్, రామ్‌నాయక్ కోరారు. పట్టణ శివార్లలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈవో సురేష్‌ను ఆయా విభాగాల కార్మికులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గుర్తింపు కార్డులు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సదుపాయాలను, ఇతర ప్రయోజనాలను కల్పించాలని కోరారు. సాధారణ, ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్ కార్మికులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

డోన్(రూరల్), జూలై 6: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జల కలశాలతో నేడు యాగంటికి పాదయాత్ర

బనగానపల్లె, జూలై 6: బనగానపల్లెలోని రవ్వలకొండలో వెలసిన శ్రీహట్టిమునిస్వామి ఆశ్రమం నుంచి ఆదివారం జల కలశాలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్రగా బయలు దేరనున్నట్లు విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. లోక కళ్యాణార్థం కలశాలతో పాదయాత్ర చేసి ఆకలశాలలోని జలాలతో యాగంటి ఉమామహేశ్వరస్వామికి జలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. వర్షాలు బాగా కురువాలని, పంటలు బాగా పండాలని, కోరుతూ పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు.


ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

బనగానపల్లె, జూలై 6: బనగానపల్లెలోని భానుముక్కల సొసైటీ ఆవరణలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. శనివారం మొక్కలు నాటారు. బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రియాంక, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచి పెద్ద చేయాలని కోరారు. కర్యాక్రమంలో సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

చీరెల వేలంలో రూ.50.56 లక్షల ఆదాయం

బనగానపల్లె, జూలై 6: బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయానికి చీరెల వేలం ద్వారా రూ. 50.56 లక్షల ఆదాయం లభించినట్లు ఈవో జీ.కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. తిమ్మాపురంకు చెందిన లక్ష్మీకాంతరెడ్డి వేలం పాటలో సీల్డ్ కొటేషన్ ద్వారా దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, పోలీసులు పాల్గొన్నారు.

నిషేధిత ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు



యర్రగుంట్లలో పురుగు మందులను పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

శిరివెళ్ల, జూలై 6 : ప్రభుత్వ నిషేధిత పురుగుమందులను విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని శిరివెళ్ల మండల వ్యవసాయాధికారి సుధాకర్ హెచ్చరించారు. యర్రగుంట్ల గ్రామంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. గ్లైఫోసెట్ వంటి నిషేధిత గడ్డి మందులను విక్రయించరాదని సూచించారు. అలాగే రైతులు లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయడంతో పాటు తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు.

● శిరివెళ్లకు చెందిన రైతు పీపీ లింగమయ్య పొలంలో చల్లిన జీలుగ విత్తనాలు సరిగ్గా మొలకెత్తకపోవడంతో వ్యవసాయాధికారి సుధాకర్ శనివారం పరిశీలించారు. మొలకలు రాని విషయాన్ని వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. శాస్త్రవేత్తలు పంట పొలాన్ని పరిశీలించేందుకు అవసరమైన నివేదికను రూపొందించి అధికారులకు అందజేస్తామని ఏవో వెల్లడించారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వాసాపురంలో వెంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూలై 6 : మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి లక్ష్మిగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారణాసి గోపిశర్మలు, శివశర్మలు స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు. రుద్రవరంలోని వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. నరసాపురం గడప లక్ష్మి నరసింహస్వామి, రుద్రవరం దొర్బి గుట్టకొండ నరసింహస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

భేటీ బచావో - భేటీ పడావోపై అవగాహన

అవుకు, జూలై 6 : మండలంలోని మంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంపై ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరమ్మ శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ విద్యార్థినులు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాజంలో ఎలా మెలగాలి అనే అంశాలపై వివరించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ పాల్గొన్నారు.

రామిరెడ్డిపల్లెలో పారిశుధ్య పనులు

సంజామల, జూలై 6: మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామం మొత్తం రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తా చెదారం వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ మంచాల వీరప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు జరిగాయి.

ఉపాధ్యాయుడి పట్ల అనుచిత ప్రవర్తన తగదు

కొలిమిగుండ్ల, జూలై 6: సమాజంలో గౌరవప్రదమైన వృత్తిలో వున్న ఉపాధ్యాయుడి పట్ల అనుచిత ప్రవర్తన తగదని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాసులు, రమణయ్య, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎం.సుంకన్న పేర్కొన్నారు. కోరుమానుపల్లెలో టీడీపీ నాయకుడు ఉపాధ్యాయుడిని దుర్భాషలాడటాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

ఉపాధ్యాయుడిని దూషించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, జూలై 6: మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిని దూషించిన ఘటనలో ఇద్దరు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు బనగానపల్లె సీఐ గోపినాథ్‌రెడ్డి శనివారం వెల్లడించారు. కోరుమానుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, దూదేకుల పెద్ద నడిపి తనను దూషించి, దాడి చేయడానికి ప్రయత్నించారని బాధిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మరోవైపు ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ కావడంతో ఎస్టీ కమిషన్ స్పందించింది. సంఘటనపై పూర్తి వివరాలు అందించాలని, నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని ఎస్టీ కార్యాలయాన్ని కోరినట్లు ఎస్టీ సంఘం నాయకులు వెల్లడించారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని రాణి

కోవెలకుంట్ల, జూలై 6: మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన పసుపుల బాలచంద్రుడు, భాగ్యమ్మ కుమార్తె పసుపుల రాణి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదివేందుకు ఎంపికైనట్లు ఏఎస్‌కే పాఠశాల కరస్పాండెంట్ లాయర్ ఆలీహుసేన్ తెలిపారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



కోవెలకుంట్లలో జగ్జీవన్‌రామ్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



డోన్‌లో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోవెలకుంట్ల, జూలై 6: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని శనివారం కోవెలకుంట్లలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్‌తో పాటు జనసంఘ రూపకర్త శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజ్జిగాళ్ల లింగన్న నివాలుర్పించారు. లింగన్న మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి దళిత ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ అనేక సంక్షమ పథకాలు రైతులకు వ్యవసాయ యోగ్యమైన ప్రాజెక్టుల నిర్మాణం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారన్నారు. అలాగే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జనసంఘం పార్టీని స్థాపించి, ఇప్పుడు భారతీయ జనతా పార్టీగా మార్పు చెంది ప్రపంచ దేశాల్లోనే అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో బన్నీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిష్టన్న, గంధం శ్రీనివాసులు, సంఘం నాయకులు ఉంగరానిగుండ్ల రాముడు, బండి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ 38వ వర్ధంతి వేడుకలను టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం పట్టణంలోని డోన్, బనగానపల్లె క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రూబెన్, మేకల నాగరాజు, వార్డు కౌన్సిలర్ నంద్యాల మధు, రామగోపాల్, గోరంట్ల, శ్రీపతి నాగరాజు, కానాల అంజి, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాముడు, సిమెంటునగర్ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బాయ్‌కాటి బెనర్జీ మాదిగ, జిల్లా అధ్యక్షులు అనిల్ నాయకులు మధుకృష్ణ, వెంకటేశ్, కార్తీక్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.2.58 లక్షలు



ఈవో రామాంజనేయులుకు రూ.లక్ష విరాళాన్ని అందజేస్తున్న భక్తులు

బేతంచెర్ల, జూలై 6: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.2.58 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.2,58,011ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు. అలాగే నంద్యాల జిల్లా చాగలమర్రి, చింతలచెరువు గ్రామానికి చెందిన ఎద్దుల జయరామిరెడ్డి, ఆయన సతీమణి ఎద్దుల జయలక్ష్మి జ్ఞాపకార్థం వారి కుమారులు ఎద్దుల కిరణ్ కుమార్ రెడ్డి, శ్రావణి దంపతులు, ఎద్దుల జయరామిరెడ్డి, జయలక్ష్మి దంపతులు కూతురు ఎద్దుల కుమారి మంజుల రూ.1,00,116 విరాళంగా ఆలయ ఈవో రామాంజనేయులుకు అందజేశారు. దాతలకు ఈవో రామాంజనేయులు స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

ఏవీ సుబ్బారెడ్డిని అరెస్టు చేయాలి



డీజీపీకి వినతి పత్రం ఇస్తున్న శ్రీదేవి కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి

ఆళ్లగడ్డ, జూలై 6: ఆళ్లగడ్డ పట్టణంలోని పాతూరులో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త అట్ల శ్రీదేవి హత్య కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న ఏవీ సుబ్బారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని దివంగత శ్రీదేవి కుమారుడు అట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కుమార్తె రమశ్రీ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును శనివారం అమరావతిలో కలిసి వినతి పత్రం ద్వారా వారు కోరారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయం



ఎస్టీయూ సభ్యత్వ పత్రాలను అందజేస్తున్న నాయకులు

ప్యాపిలి, జూలై 6: ఉపాధ్యాయుల సంక్షేమమే ఎస్టీయూ ధ్యేయమని ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్ అన్నారు. శనివారం మండలంలోని రాచెర్ల, బోంచెర్వుపల్లి, నేరేడుచెర్ల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్టీ యూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటనాయక్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తమ సంఘం ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నపురెడ్డి, చంద్రమౌళి, ఈశ్వర్‌యాదవ్ పాల్గొన్నారు.

సెలవు పెట్టకుండా ఎలా వెళ్తారు?

ఈవోపై ఎంపీడీవో ఆగ్రహం

రుద్రవరం, జూలై 6: రుద్రవరంలో కార్యాలయాలను ఎంపీడీవో రామచంద్ర, ఈవోపీఆర్‌డి శ్రీనివాసశర్మ శనివారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఈవో సుబ్బారావు లేకపోవడంతో సిబ్బందిని విచారించారు. సెలవు పెటకుండా వెళ్లడంతో ఎంపీడీవో ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ అవసరాలపై వెళ్లితే తప్పనిసగా సెలవు పెట్టాలని, లేకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పాఠశాలకు ఆటో వితరణ

ఆళ్లగడ్డ, జూలై 6: ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రధాన భారతీ విద్యామందిరం పాఠశాలకు ఆలమూరు కేనరా బ్యాంకు మేనేజరు సందీప్ శనివారం ఆటోను పాఠశాల అధ్యక్షుడు టీఎంసీ వేణుగోపాల్‌కు అందించారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి కేనరా బ్యాంకు డీజీఎం రాఘవేంద్రరావు రూ.3 లక్షలను సీఎస్ఆర్(సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం) కింద మంజూరు చేయడంతో ఆ నిధులతో కొనుగోలు చేసిన ఆటోను బ్యాంకు మేనేజర్ సందీప్ అందజేశారు. కార్యక్రమంలో కేనరా బ్యాంకు డీజీఎం తండ్రి మాధవరావు, లాయరు మురళీధర్‌గౌడు, పాఠశాల కార్యదర్శి రామలింగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

ప్యాపిలి, జూలై 6: విధులపై వైఖరి మార్చుకోకపోతే వేటు తప్పదని వార్డన్‌పై ఎంపీడీవో సాయిమనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి భవనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీవో వసతి భవనంలోని గదులను, వాటర్ ట్యాంకును, వంట శాలను పరిశీలించారు. అయితే వసతి భవనం అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉషా, మానస, ఉద్యోగులు పాల్గొన్నారు.

అహోబిలంలో ప్రత్యేక పూజలు



ఆళ్లగడ్డ, జూలై 6: అహోబిలంలో జీర్ణోద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉత్సవమూర్తులైన ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అష్టదిక్బంధన, మహాసంప్రోక్షణ, చాతుర్‌తానార్చన, హోమాలు, పూర్ణాహుతి, శాత్తుముర్రై కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు.

హైవే పనులను అడ్డుకున్న రైతులు

బేతంచెర్ల, జూలై 6 : హైవే నిర్మాణం పనులు శనివారం రైతులు అడ్డుకున్నారు. తమకు సమాచారం ఇవ్వకుండానే కాంట్రాక్టర్ హైవే పనులను ప్రారంభించారని రైతులు ఆరోపించారు. ఈ హైవే పనుల వల్ల తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారుతుందని అన్నారు. తమకు వేరే రస్తా చూపించి పనులను చేసుకోవాలని, లేకుంటే పనులను అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు.

అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి



శెట్టివీడు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో అనూరాధ

చాగలమర్రి, జూలై 6: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యంశాలు బోధించాల్సిన అవసరం ఉందని ఎంఈవో అనూరాధ అన్నారు. శనివారం మండలంలోని శెట్టివీడు గ్రామంలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, నాణ్యతగల భోజనం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీకుమారి, సీఆర్పీ ఖాసీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



డి.వనిపెంట గ్రామంలో ర్యాలీ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

చాగలమర్రి, జూలై 6: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో వైద్యులు తస్లిమ్ సుల్తానా ఆధ్వర్యంలో విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి డెంగీపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు, ఆహారం కలుషితం కావడం ద్వారా అతిసార వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కేవీ సుబ్బరాయుడు, సీహెచ్‌వో కృష్ణమ్మ, ఏఎన్ఎం సంధ్యా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



మద్దూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో న్యామతుల్ల

చాగలమర్రి, జూలై 6: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. శనివారం మండలంలోని మద్దూరు, నగల్లపాడు ఉన్నత, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం తయారు చేయాలని, కోడిగుడ్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లలిత కుమారి, నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలిత సహస్ర పారాయణం

చాగలమర్రి, జూలై 6: చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆషాఢ మాసం శనివారం ఎస్ఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ భవానమ్మ ఆధ్వర్యంలో సామూహికంగా భక్తిశ్రద్ధలతో లలిత సహస్రపారాయణం చేశారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పెరిగిన ఆదాయం

దొర్నిపాడు, జూలై 6: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో వెలసిన గౌరి భోగేశ్వరస్వామి, లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాలకు సంబంధించి మాన్యం భూములను కార్యనిర్వాహణాధికారి చంద్రుడు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గౌరిభోగేశ్వరస్వామికి చెందిన 46 ఎకరాలు, లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయానికి చెందిన 44.14 ఎకరాలు ఆలయ భూములకు వేలం పాట నిర్వహించగా రూ.20.14 లక్షలు వేలం పాడటం జరిగిందని అన్నారు. గత ఏడాది రూ.16.38 లక్ష లు పాట పాడటం జరిగిందని అన్నారు. ఈ ఏడాది గతంలో కంటే రూ.3.76 లక్షలు ఆదాయం పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఆలయ ధర్మకర్తలు లింగుట్ల నాయుడు, నారాయణస్వామి, ఎండూరి గోపాల్‌నాయుడు, మహేష్ పాల్గొన్నారు.

కోవెలకుంట్లకు నేడు మంత్రి బీసీ రాక



కోవెలకుంట్ల, జూలై 6: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం కోవెలకుంట్లకు రానున్నట్లు మంత్రి వ్యక్తిగత పీఏ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సంజామల మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులతో సమావేశం కానున్నారన్నారు. ఈ సమావేశంలో మండల సమస్యల పరిష్కారంపై చర్చించనట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

రేపు కొలిమిగుండ్లకు...

కొలిమిగుండ్ల: మంత్రి బీసీ జనార్ధనరెడ్డి రేపు సోమవారం కొలిమిగుండ్ల మండలానికి రానున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి శనివారం వెల్లడించారు. బెలుంగుహల ఆవరణలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.

మహిళ పై దాడి

రుద్రవరం, జూలై 6 : మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన బయాయమ్మ అనే మహిళపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బాలన్న శనివారం తెలిపారు. కోడి పిల్లల విషయంలో బయమ్మను, భర్త మాబుసాహేబ్‌లను ఇంటి పక్కనున్న వ్యక్తులు దాడి చేశారని ఏఎస్ఐ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రఫి, రహీం, బాబయ్య అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్ఐ శనివారం తెలిపారు.

జూనోసిస్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూలై 6: జూనోసిస్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యశాఖ ఏడీ వరప్రసాదు సూచించారు. శనివారం చాగలమర్రి, ముత్యాలపాడు పశువైద్య కేంద్రాల్లో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించారు. పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేశారు. ఏడీ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులే జూనోసిస్ వ్యాధులు అన్నారు. మూగ జీవాల పెంపకంలో అవగాహనతో పాటు అప్రమత్తత ఎంతో అవసరం అన్నారు. ఇళ్లలో పెంచుకునేకుక్కల వల్ల ర్యాబిస్ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది ప్రాణాంతకం అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ముత్యాలపాడు ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో మండల పశువైద్యాధికారి సాయిబాబా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు విజయలక్ష్మి, నళిని, పీఏ కోటయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : సమాజంలో పెంపుడు జంతువుల నుండి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా రేబిస్ నిరోధక టీకాను వేయించి నివారించుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ క్రిష్ణకుమార్ సూచించారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన ప్రపంచ జూనోసిస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుండి రక్షణ పొందేందుకు సరైన వ్యక్తిగత శుభ్రత, నిర్వహణ నైపుణ్యం, టీకా రక్షణ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, ఎ.లక్ష్మిదేవి, అన్నపూర్ణ, క్రిష్ణదాస్ పాల్గొన్నారు.

● కుక్కలకు టీకాలు వేయించి రేబిస్ వ్యాధిని నివారించుకోవాలని బిజినవేముల పశువైద్యాధికారి క్రిష్ణకుమార్ పేర్కొన్నారు. శనివారం కోవెలకుంట్లలోని పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ సందర్భంగా కోవెలకుంట్ల, కలుగొట్ల, బిజినవేముల పశువైద్య కేంద్రాల్లో ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ క్రిష్ణకుమార్ 41 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, ఎల్ఎస్ఎస్ శ్రీకాంత్, ఓఎస్ శివబ్రహ్మం, ఎహెచ్ఏలు పాల్గొన్నారు.

డోన్(రూరల్): పట్టణంలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జునోసిస్ దినోత్సవం పురస్కరించుకుని డోన్ పశువైద్యశాలలో 50 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డా.నాగరాజు, డాక్టర్లు భాను, హరీష్, సుష్మిత, పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని ప్రాంతీయపశువైద్యశాలలో శనివారం జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటీరేబీస్ టీకాలను ఉచితంగా వేశారు. పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మారుతీసాకారాం, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు ఖురేష, ముక్తియార్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వరల్డ్ ర్యాబిస్‌డే సందర్భంగా పశువైద్యాధికారి ధనుంజయుడు కుక్కలకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధులను జునోసిస్ వ్యాధులుగా గుర్తించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రామచంద్రాపురం బీఎల్‌వో రమేష్, గోపాలమిత్ర మధు, సిబ్బంది ఉన్నారు.

ఆళ్లగడ్డ: మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్ అంటారని, ఈ వ్యాధులు సోకకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమణయ్య చెప్పారు. ఈ మేరకు ఆయన ఆళ్లగడ్డ పట్టణంలోని పశువైద్యశాలలో శనివారం టీకాలు వేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కొండారెడ్డి పాల్గొన్నారు.

అవుకు: జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోసిస్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవుకు, గుండ్లశింగవరం పశువైద్యాధికారులు డాక్టర్ భారతీదేవి, ఐశ్వర్య శనివారం అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నామన్నారు.

సంజామల: జూనోసిస్ ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంజామల ప్రాంతీయ పశువైద్యశాలలో 30 కుక్కలకు రేబిస్ టీకాలు వేయించారు. జునోసిస్ వ్యాధి జంతువులకు సోకి మనుషులకు సంక్రమించే అవకాశం ఉన్నందున వ్యాధికి సంబంధించి వ్యాధి నిరోధక రేబిస్ టీకాను కుక్కలకు వేయించినట్లు పశుసంవర్ధకశాఖ ఎ.డి మోహన్‌రావు తెలిపారు.



అవుకులో...



చాగలమర్రిలో కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ వరప్రసాదు



పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న డాక్టర్లు



బనగానపల్లెలో...



కోవెలకుంట్లలో...





కొలిమిగుండ్ల, సంజామలలో